క్లుప్తంగా

రేపు మాజీ సైనికుల సమావేశం

వైవీయూ : కడప నగరంలోని సీఎస్ఐ హైస్కూల్‌లో ఈనెల 8వ తేదీ ఉదయం 10 గంటలకు మాజీ సైనికుల సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి గోపాల్ రెడ్డి తెలిపారు. సర్వీస్ షీట్‌లోని తొప్పొప్పులు, కిందర్ రోల్స్, పెన్షన్, జిల్లా సైనిక కార్యాలయం, మిలటరీ హాస్పిటల్, క్యాంటీన్‌ల సౌలభ్యాలు, వాటి పనితీరుపై చర్చ, సూచనలు, సలహాలు స్వీకరించనున్నట్లు తెలిపారు.

నూతన కోర్సులు

వైవీయూ : కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్ శుక్రవారం 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి కళాశాలలో సర్టిఫికెట్ కోర్సులను ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇలాంటి సర్టిఫికెట్ కోర్సుల వలన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పట్ల అవగాహన పెరుగుతుందన్నారు. జంతుశాస్త్ర విభాగాధిపతి డా. పి. రవిశేఖర్, సర్టిఫికెట్ కోర్స్ ఇన్ టూల్స్ అండ్ టెక్నిక్స్ ఇన్ బయాలజీ కోర్సు కోఆర్డినేటర్ డా. సావిత్రి మాట్లాడుతూ సర్టిఫికెట్ కోర్సు విధానాలను వివరించారు.

రేపు 'ఆచార్య మూల' కు పౌర సన్మానం

కడప కల్చరల్ : యోగి వేమన విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డికి ఆదివారం ఉదయం 9.30 గంటలకు ఖాజీపేట మండలం తుడుములదిన్నె సచివాలయ ప్రాంగణంలో పౌర సన్మానం నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా మైదుకూరు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, విశిష్ఠ అతిథిగా వైఎస్సార్ సీపీ సమన్వయకర్త శెట్టిపల్లి నాగిరెడ్డి, ప్రత్యేక అతిథిగా ఏపీఐఐసీ రాష్ట్ర డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగాధర్ పాల్గొంటారు.

ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సలీంబాషా

వైవీయూ: ర్యాగింగ్‌కు యువత దూరంగా ఉండాలని, స్నేహపూర్వక వాతావరణంలో విద్యను అభ్యసించాలని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. సలీంబాషా పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యవక్తలుగా విచ్చేసిన జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ (డీఎల్ఎస్ఏ) లీగల్‌సెల్ కౌన్సిల్ ప్రతినిధులు ఎం. శాంత, మనోహర్‌లు మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే కలిగే నష్టాలను, చట్టపరంగా తీసుకునే చర్యలను వివరించారు. అనంతరం గృహహింస, వరకట్న వేధింపులు తదితర అంశాలపై అవగాహన, చట్టపరంగా లభించే రక్షణ గురించి వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. జి. విజయలక్ష్మిదేవి, నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవాష్టమి పూజలు

కడప కల్చరల్ : కడప నగర శివార్లలోని శ్రీ ఇష్ట కామ్యార్థ కాలభైరవస్వామి ఆలయంలో శుక్రవారం కాలభైరవాష్టమిని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం అభిషేకం, అష్టోత్తరం, కాలభైరవస్తోత్రం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రత్యేక పూజల్లో భాగంగా భక్తులు వెంట తెచ్చుకున్న గుమ్మడికాయలతో దీపాలు వెలిగించి కుష్మాండ దీప సేవ చేశారు. హాజరైన భక్తులందరికీ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అభినందన

వైవీయూ : తల్‌సైనిక్ క్యాంపులో కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ కేడెట్స్ సత్తాచాటారు. కళాశాలకు చెందిన ఎస్. రంగశివజ్యోతి, టి. రూపలు తల్‌సైనిక్ క్యాంపులో పలుదశల్లో ఎంపికవుతూ సెప్టెంబర్ 19 నుంచి 28వ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహించిన అఖిల భారత తల్‌సైనిక్ క్యాంపులో పాల్గొని సత్తాచాటారు. ఈ సందర్భంగా శుక్రవారం ఘనత సాధించిన ఇద్దరు ఎన్‌సీసీ కేడెట్స్‌కు అభినందన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా, ఎన్‌సీసీ అధికారి విన్నీతేజ పాల్గొన్నారు.

విద్యాఫలాలు సక్రమంగా అందాలి

వైవీయూ : విద్యాఫలాలు విద్యార్థులకు సక్రమంగా అందినప్పుడే విద్యకు సార్థకత చేకూరుతుందని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో ఐక్యూఏసీ ఆధ్వర్యంలో 'న్యాక్ సెవెంత్ క్రైటీరియా బెస్ట్ ప్రాక్టీసెస్' అన్న అంశంపై జాతీయ వెబినార్ నిర్వహించారు. అనంతరం వర్చువల్ విధానంలో మహారాష్ట్రకు చెందిన డా. ఆదాదేవి గోయంక, డా. లీలామోహన్‌రావులు ఉపన్యసించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. సి.వి. కృష్ణవేణి, టెక్నికల్ కోఆర్డినేటర్ డా. కె. శాలిని పాల్గొన్నారు.

'లంకమల'లో కూంబింగ్

సిద్దవటం : ఎర్రచందనం స్మగ్లర్ల కోసం లంకమల అభయారణ్యంలో శుక్రవారం కూంబింగ్ నిర్వహించినట్టు రేంజర్ కళావతి తెలిపారు. ఈ సందర్భంగా రేంజర్ మాట్లాడుతూ కడప బీటులో ఎర్రచందనం స్మగ్లర్లు ఉన్నారన్న సమాచారంతో కడప డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి ఆదేశాల మేరకు ముందస్తు చర్యగా సిద్దవటం అటవీశాఖ పరిధిలోని సిద్దవటం, గొల్లపల్లి, రోళ్ళబోడు బీట్లలోని సమస్యాత్మక ప్రదేశాల్లో, నీరు ఉన్న ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి కూంబింగ్ నిర్వహించామన్నారు.

జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



సమావేశానికి హాజరైన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు

– ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: నిన్నటి కంటే రేపు బాగుండాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. శుక్రవారం స్థానిక అపూర్వ కళ్యాణ మండపంలో 'ఎందుకు ఆంధ్రాకు జగన్ కావాలి' కార్యక్రమంపై క్లస్టర్–2 పరిధిలోని డివిజన్ల కార్పొరేటర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు 98 శాతం అమలు చేశారని తెలిపారు. చంద్రబాబు ప్రజాధనాన్ని దోపిడీ చేసి జైలుకు వెళ్లారనే విషయాన్ని ప్రజలకు తెలియజేయడంతోపాటు, ఎల్లో మీడియా దుష్ప్రచారాన్ని కూడా తెలపాలన్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రతి ఒక్కరికీ బీమా నమోదు పూర్తి చేయించాలన్నారు. ×జగనన్న ఆరోగ్య సురక్ష, ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఇప్పుడు కష్టపడి పనిచేస్తే భవిష్యత్ కార్యకర్తలదేనని భరోసా ఇచ్చారు. నాడు–నేడు ద్వారా ఆసుపత్రులు, పాఠశాలల భవనాల రూపురేఖలే మారిపోయాయన్నారు. వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పార్టీకి మూల స్తంభాల్లాంటి వారన్నారు. పార్టీ నిర్దేశించిన కార్యక్రమాలకు హాజరు కాకుండా ఉన్నవారిని గుర్తించి, ఉత్సాహంగా ఉన్నవారిని నియమించాలన్నారు. స్వయం సహాయ సంఘాల్లో ఉన్న మహిళలను కూడా నియమించవచ్చని సూచించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, పార్టీ నాయకులు జయచంద్రారెడ్డి, లక్ష్మయ్య, ఐస్‌క్రీం రవి, శ్రీరంజన్‌రెడ్డి, రామచంద్ర, సుబ్బరాయుడు, మేసా ప్రసాద్, ఆర్‌వీ రమణ, కె. బాబు పాల్గొన్నారు.

మంచి చేసే ప్రభుత్వమిది



ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజలందరికీ మంచి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా అన్నారు. శుక్రవారం 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా 7 డివిజన్‌లోని అప్సర హాలు, నెహ్రూనగర్ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు.

– ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కుల,మత, పార్టీలకతీతంగా అర్హత ఉన్న పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, ఆయన్ను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు.

– ఈ సందర్భంగా వి. తులసి అనే మహిళ తనకు వైఎస్సార్ రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ పింఛన్ కానుక, చేయూత, అమ్మ ఒడి, జగనన్న ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదు ద్వారా రూ. 10,50,000 లబ్ధి చేకూరిందని ఆనందం వ్యక్తం చేసింది. ఇన్ని సంక్షేమ పథకాలు ఏ ప్రభుత్వం లో మాకు అందలేదని ఇలాంటి ముఖ్యమంత్రి కి ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపింది. జి. తిరుమలమ్మ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో తమకు వివిధ పథకాల ద్వారా రూ.10.60లక్షల మేలు జరిగిందని సంతోషం వ్యక్తం చేసింది. గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఇంత లబ్ధి చేకూరలేదని, జగనన్నకు తామంతా తోడుగా ఉంటామని తెలిపింది.

– ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, 7వ డివిజన్ ఇంచార్జి గంగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రారెడ్డి, తోట క్రిష్ణ, సుబ్బారెడ్డి, సీహెచ్ వినోద్, రామ్మోహన్‌రెడ్డి, గోపాలక్రిష్ణ, అర్జున్, మహిళా నేతలు పత్తిరాజేశ్వరి, టీపీ వెంకట సుబ్బమ్మ, ఎం. సరస్వతి, రత్నకుమారి, మల్లీశ్వరి, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

బార్మీ అన్నదానం

కడప కల్చరల్ : సమాజంలో ధార్మిక గుణాన్ని పెంచేందుకు బార్మి అన్నదానం ఉపయోగపడగలదని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాష అన్నారు. శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో ఆయన కార్యాలయంలో బార్మి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అంజద్‌బాష మాట్లాడుతూ మహాప్రవక్త మహమ్మద్ జన్మదినాన్ని పురస్కరించుకుని పేదల ఆకలి తీర్చేందుకు పోతుల వెంకట్రామిరెడ్డి ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు, ఇంటాక్ కన్వీనర్ కె.చిన్నపరెడ్డి, లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్ఆర్ సర్కిల్: బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో సీపీఐ ఆధ్వర్యంలో వివిధ రాజకీయ, ప్రజా సంఘాలు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్ర మాట్లాడుతూ కృష్ణా నీటి వివాదాలపై ఏర్పాటైన ట్రిబ్యునల్స్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు కేటాయించిన నీటిని పునః పంపిణీ పేరుతో ఏపీ తెలంగాణ, రాష్ట్రాలకే పరిమితం చేస్తూ బాధ్యతలను బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు కట్టబెట్టి తద్వారా తెలంగాణలో రాజకీయ లబ్ధి పొందాలని బీజేపీ చూస్తోందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అడ్డగోలు నిర్ణయాలు చేసి అందలమెక్కాలని చూస్తోందని విమర్శించారు. దీనితో పాటు ఇంకా పలు సమస్యలపై ఈనెల 8న జిల్లావ్యాప్తంగా నియోజకవర్గ కేంద్రాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు, 9న కడప కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టనున్నట్లు తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు చంద్రశేఖర్, డాక్టర్ ఓబుల్ రెడ్డి, రాము, రమణయ్య, ఎంవి సుబ్బారెడ్డి, దస్తగిరి రెడ్డి, శివారెడ్డి, బసిరున్నీషా సుబ్రహ్మణ్యం, అన్వేష్, మల్లికార్జున, ఏఐటీయూసీ వేణుగోపాల్, కేసీ బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి

వల్లూరు : డ్వాక్రా సంఘాల మహిళలు వైఎస్ఆర్ క్రాంతి పథం ప్రాజెక్ట్ నుంచి పొందిన రుణాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ ఏరియా కోఆర్డినేటర్ రఘునాథరెడ్డి తెలిపారు. స్థానిక మండల సమాఖ్య భవనంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు గౌరి అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల సమాఖ్య వార్షిక మహాసభ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలోని మహిళా స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి వైఎస్ఆర్ కేపీ సిబ్బంది కృషి చేయాలని ఏపీఎం శైలజ తెలిపారు. అనంతరం మండల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా జే సుహాషిణి, ఉపాధ్యక్షురాలుగా టీ శ్రీదేవి, కార్యదర్శిగా వై.ఈశ్వరమ్మ, ఉప కార్యదర్శిగా ఎన్.రమాదేవి, కోశాధికారిగా జీ పార్వతిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ కేపీ కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు, ఎల్‌సీ సీసీ, సిబ్బంది, వీవోల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చెన్నూరు : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సతీష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆయుష్మాన్ భవ ' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సీజన్‌లో ఎక్కువగా విష జ్వరాలు, జలుబు, దగ్గు, కండ్ల కలక ఎక్కువగా వస్తోందన్నారు. ప్రజలు తమ ఇళ్ల చుట్టూ ఉండే పరిసరాలను శుభ్రపరచుకోవాలన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు డాక్టర్లు 24 గంటలు అందుబాటులో ఉంటారన్నారు. అన్ని రకాల మందులతో పాటు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారన్నారు. అనారోగ్య సమస్యలు వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష పేదలకు వరం

కడప కార్పొరేషన్: 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం పేద ప్రజలకు గొప్ప వరం లాంటిదని, ప్రతి ఒక్కరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాష పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పాత కడప ప్రాంత సమీపంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వద్ద జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో దేవుని కడప, గౌస్ నగర్, మాసాపేట, పాత కడప ప్రాంతాలకు సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష 5 వ క్యాంపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్య ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ రాష్ట్రవ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. మహిళలకు సంబంధించి గైనకాలజిస్టులు, ఆర్థోపెడిక్ డాక్టర్లు, చిన్నపిల్లల నిపుణులు, ఉన్నారని, కంటికి సంబంధించి, ఇతర ఐదు మంది డాక్టర్లు కూడా ఉన్నారన్నారు. ఈ శిబిరంలో వారికి సంబంధించిన 11 రకాల పరీక్షలను కూడా నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. తొలుత డిప్యూటీ సీఎం.. అర్బన్ హెల్త్ సెంటర్ దాతలు జరుగు రాజశేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డితో కలిసి ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రతి స్టాల్ ను పరిశీలించి, వైద్యులతో, సిబ్బందితో అక్కడికి విచ్చేసిన రోగులతో వివరాలు అడిగి తెలుసుకొని కొన్ని సూచనలు చేశారు. తాను స్వయంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆ తర్వాత రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు మెంబర్ మాసీమ బాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్, నాయకులు నారపురెడ్డి సుబ్బారెడ్డి, తోట కృష్ణ, కార్పొరేటర్లు చెన్నయ్య, సుబ్బా రెడ్డి, నాగమణి, మహమ్మద్ ఆరీఫ్, ఇంచార్జిలు త్యాగరాజు పాల్గొన్నారు.

రైల్వేలో ఊపందుకున్న ఎన్నికల ప్రచారం

రాజంపేట : నందలూరు, కడప సెక్షన్ల పరిధిలో సౌత్ సెంట్రల్ రైల్వే కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికల హోరు జోరందుకుంది. పోటాపోటీగా నేతలు శుక్రవారం ఉభయ జిల్లాలోని వివిధ రైల్వేస్టేషన్లలో ప్రచారం చేశారు. కడప, నందలూరు మజ్దూర్ యూనియర్, సంఘ్ నేతలు స్టేషన్లవారీగా వెళ్లి కార్మికులను కలుసుకొని కరపత్రాలను పంచారు. తమ ప్యానెల్ అభ్యర్థులను గెలిపించాలని సంఘ్, మజ్దూర్ కార్మికనేతలు అభ్యర్థించారు. నందలూరు సెక్షన్ పరిధిలో భాకారపేట నుంచి బాలపల్లె(తిరుపతి జిల్లా) వరకు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. కడప సెక్షన్‌లో కొండాపురం, ఎర్రగుంట్ల నుంచి జమ్మలమడుగు వరకు సొసైటీ ఎన్నికల ప్రచారాన్ని జరిపారు. ఈనెల 12న పోలింగ్ ఉండటంతో నిత్యం సెక్షన్‌లో ఓటు కలిగిన కార్మికుని కలిసి విన్నవిస్తున్నారు. సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ తరపున నందలూరు బ్రాంచి సెక్రటరీ విశ్వనాథ్, కడప బ్రాంచి సెక్రటరీ మధుసూదనరావు, సౌత్‌సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ నందలూరు బ్రాంచి రవిప్రకాశ్, కడప బ్రాంచి నేత ఈశ్వరయ్య తదితర ఆధ్వర్యంలో ప్రచారం కొనసాగుతోంది.

భగవంతుని నామార్చనే మోక్షానికి మార్గం



ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న స్వామిజీ



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కడప కల్చరల్ : ప్రస్తుత కాలంలో భగవంతుని నామార్చనే మోక్షానికి మార్గమని ఆధ్యాత్మిక వేత్త త్రిదండి సంపత్‌కుమార రామానుజ జీయర్ స్వామి అన్నారు. ధార్మిక పర్యటనలో భాగంగా శుక్రవారం కడప లోని శ్రీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయం వద్ద గల వాసవీ భవన్‌లో విడిది చేసి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఆయన మాట్లాడుతూ ధార్మిక గుణసంపన్నత కారణంగానే ప్రపంచ వ్యాప్తంగా మన దేశానికి గౌరవనీయమైన స్థానం లభించిందన్నారు. ఇక్కడి ఆధ్యాత్మిక చింతన, పూజా విధానం, ధార్మిక జీవనం తదితర అంశాలు ప్రపంచంలోని అన్ని దేశాల ప్రజలను ఎంతో ఆకర్షిస్తున్నాయని, అందుకే వారు తరుచూ మన దేశానికి వచ్చి ధార్మిక జీవనం గడుపుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. కార్యక్రమంలో గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజు గుప్తా, పెరుమాళ్ల బాల సుధాకర్, పాలాది సుబ్రమణ్యం, వీహెచ్‌పీ ప్రాంత ధర్మాచార్యా సంపర్క ప్రముఖ్ బెస్తవేముల రామమహేష్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీను, యాదాళ్ల రమణ, సుమన్, దేవతి శంకరయ్య, అర్చక సంఘం నాయకులు విజయ్‌భట్టర్, న్యాయవాది భారతి తదితరులు పాల్గొన్నారు. పలు దేవాలయాల ధర్మకర్తలు, చైర్మన్లు స్వామిజీని దర్శించుకుని ఘనంగా సత్కరించి ఆశీర్వాదం పొందారు.

ప్రజల చెంతకే మెరుగైన వైద్యసేవలు


వల్లూరు : మండలంలోని కోట్లూరు గ్రామ సచివాలయం ఆవరణలో శుక్రవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మొత్తం 310 మందికి వైద్య సేవలను అందించినట్లు వైద్య నిపుణులు తెలిపారు. 10 మందిని ఉన్నత స్థాయి వైద్య సేవలకై రెఫర్ చేశామన్నారు. అనంతరం మందులను, ఆయుష్మాన్ భవ ఆరోగ్య కార్డులను పంపిణీ చేశారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీడీవో జుబేద, తహసీల్దార్ శంకర్‌రావు, ఈవోపీఆర్‌డీ ప్రసాద్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రి : పేద ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ తెలిపారు. మండలంలోని గుర్రాలచింతపల్లె జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేసి రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, తహసీల్దార్ ఉదయభాస్కర్ రాజ, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, వైద్యుడు వినయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కమలాపురం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా స్పెషలిస్ట్ డాక్టర్లు అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల స్పెషలాఫీసర్ నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం గంగవరం గ్రామ సచివాలయంలో జరిగిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

– ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : నగర పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగ వంతం చేయాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ మార్పురి మేరి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో 8 అంశాలపై చర్చించగా ఆరు అంశాలను ఆమోదించారు. రెండు అంశాలను వాయిదా వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కమలాపురంను నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ చేసిన తర్వాత రూ.36 కోట్లతో డ్రైనేజ్ పనులు చేపట్టామన్నారు. అలాగే ప్రస్తుతం దాదాపు రూ.100 కోట్లతో మంచినీటి పైప్‌లైన్ పనులు, రోడ్డు విస్తరణ, బ్యూటిఫికేషన్, మున్సిపల్ కార్యాలయ భవనం, సీసీ రోడ్లు తదితర పనులు జరుగుతున్నాయన్నారు. అయితే ఈ పనుల్లో జాప్యం లేకుండా అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పనిచేసి పనుల్లో వేగం పెంచాలన్నారు. ఇప్పటికే ఆసుపత్రి, పాలిటెక్నిక్ భవనాలు ప్రారంభించామన్నారు. కమలాపురం గ్రామ పంచాయతీ అయితే నిధులు తక్కువగా వస్తాయని, అందుకే నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ చేసామన్నారు. ఆర్‌ఓబీ, బైపాస్ కూడా త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు సాదిక్, శ్రీనివాసరెడ్డి, టౌన్ కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు, కమిషనర్, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

కమలాపురం : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు చేసిన వారికి, ప్రోత్సహించిన వారికి జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బమ్మ తెలిపారు. శుక్రవారం లేటపల్లెలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామాల్లో వివాహం చేస్తే తమ బాధ్యత తీరిపోయిందని తల్లిదండ్రులు భావిస్తారని, ఇది సరైన విధానం కాదన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిపితే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జాకీర్, కిశోర బాలికలు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న డ్రైవర్లు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు, ఓం శాంతి బ్రహ్మకుమారి ప్రదీప అక్కయ్యలు తెలిపారు. శుక్రవారం కడప డీపీటీఓ కార్యాలయంలో అత్యల్ప కేఎంపీఎల్, కంప్లెయిట్ వచ్చిన, ఆల్కహాల్ పరీక్షల్లో పట్టుబడిన డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీకి ముఖ్యంగా ఇంధనం ఆదా చేస్తే ఆదాయం తెచ్చినట్లవుతుందన్నారు. అలాగే ప్రయాణీకులతో అమర్యాదగా ప్రవర్తించడం సరైంది కాదని సూచించారు. ప్రయాణీకులే ఆర్టీసీకి దేవుళ్లని, అలాంటి వారితో మర్యాద పూర్వకంగా ప్రవర్తించేలా చూడాలన్నారు. ర్యాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం నిష్ణాతులైన ఇన్‌స్ట్రక్టర్ల చేత అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ప్రభుత్వ సలహాదారుడు



కడప అగ్రికల్చర్: జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్‌ను రాష్ట్ర వ్యవసాయ ప్రభుత్వ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి శుక్రవారం కడపలోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఎస్పీని కలిసిన వారిలో దువ్వూరు పీఏసీఎస్ ప్రెసిడెంట్ ఇరగంరెడ్డి విశ్వేశ్వరరెడ్డి, గుడిపాటు ఎంపీటీసీ శ్రీనివాసులరెడ్డి ఉన్నారు.

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని ఆర్‌సెటీ డైరెక్టర్ ఎస్.నారాయణరెడ్డి ఒకప్రకటనలో తెలిపారు. టైలరింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్ తదితర వాటిలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలకు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. 18–45 సంవత్సరాల మధ్య వయస్సుగలవారు అర్హులన్నారు. ఈనెల 16 నుంచి తరగతులు ప్రారంభిస్తారన్నారు. వివరాలకు 94409 05478 సంప్రదించాలన్నారు.

టాటా జెన్ నెక్సాన్ మార్కెట్‌లోకి విడుదల



టాటా న్యూ నెక్సాన్‌ను ఆవిష్కరిస్తున్న డీటీసీ మీరా ప్రసాద్ తదితరులు

కడప కార్పొరేషన్: టాటా మోటార్ కంపెనీ కొత్తగా ప్రవేశపెట్టిన జెన్ నెక్సాన్ కడప మార్కెట్‌లోకి విడుదలైంది. డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మీరాప్రసాద్, ఎంవీఐ లక్ష్మిప్రసన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు జేవీ సుబ్బారెడ్డి, కె. రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు ఆర్. చెన్నయ్య, జఫ్రుల్లా, హరూన్ గ్రూప్స్ ఎండీ ఎస్‌బి అహ్మద్‌బాషాలు నూతన వాహనాన్ని ఆవిష్కరించారు. స్థానిక హైదరాబాద్– తిరుపతి హైవేలో ఉన్న హరూన్ టాటా మోటార్స్ షోరూంలో ఈ కార్యక్రమంలో అహ్మద్‌బాషా మాట్లాడుతూ కొత్త నెక్సాన్ అద్భుతమైన ఎస్‌యూవీ డిజైన్ కలిగి ఉందన్నారు. అనంతరం వాహనానికి సంబంధించిన బ్రోచర్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో హరూన్ గ్రూప్ డైరెక్టర్లు అర్షద్‌బాషా, ఆసిఫ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

అవార్డు అందుకోవడం సంతోషదాయకం



ఆర్టీసీ ఎండీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సగినాల శ్రీనివాసులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ ఉద్యోగులతో సీసీఎస్‌లో 132 ఆర్డీలు చేయించినందుకు రాష్ట్రంలో మొదటిస్థానంలో నిలిచి అవార్డు అందుకోవడం సంతోషదాయకంగా ఉందని ఏపీఎస్ ఆర్టీసీ కడప డిపో సీసీఎస్ డెలిగేట్ సగినాల శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం విజయవాడలో 68వ కో ఆపరేటివ్ సొసైటీ జనరల్ బాడీ మీటింగ్‌లో ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్, ఇతర అధికారుల చేతుల మీదుగా అవార్డు అందుకోవడం జరిగిందన్నారు. సమావేశంలో తాను చేసిన కృషికి ఈ అవార్డు దక్కడం సంతోషదాయకంగా ఉందని తెలియజేశారు.

నేడు ఎమ్మెల్యే రాక

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గలపల్లె పంచాయతీలో శనివారం జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష అలాగే నాగిరెడ్డిపల్లి మెయిన్ రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమాలకు ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకే దిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులరెడ్డిలు హాజరవుతున్నట్లు మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండల నాయకులు, కార్యకర్తలు, ఎంపీటీసీలు, సర్పంచులు, అభిమానులు పాల్గొనాలని ఆయన తెలిపారు.

హాస్టల్ వార్డెన్‌గా వెంకటరమణ

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ అంధ విద్యార్థుల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉన్న వికలాంగ సంస్థ ఆధ్వర్యంలో నడుపుతున్న హాస్టల్‌కు వార్డెన్‌గా అంధుల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెడ్ టీచర్ వెంకటరమణకు అదనపు బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు ఆయన ఎఫ్ఏసీ వార్డెన్‌గా బాధ్యతలను స్వీకరించారు. ఇందుకుగాను కడప ఎంఈఓ పాలెం నారాయణ, హెడ్‌మాస్టర్ శంకరయ్య, పాఠశాల సిబ్బంది వెంకటరమణను సన్మానించారు.